## బాంకు బద్దలైంది

ఇది 1961లో సియాటెల్ జరిగిన బాంకు దోపిడీ కథ. దోపిడీ అనగానే నల్లముసుగులు వేసుకుని తుపాకీలూపుకుంటూ కాషియర్ దగ్గరకు వెళ్లి హేండ్సప్ అనే కథ కాదు. వేరే ఎవరి ప్రమేయం లేకుండా ఏకైక వ్యక్తి ఏకంగా వాల్ట్‌కే ఎసరు పెట్టిన కథ.

జేమ్స్ బ్రెన్నాన్ వియర్ట్ (జూనియర్) అనే ఓ పాతికేళ్ల యువకుడు విమానాలు నడిపించేవాడు. 1960 అక్టోబరులో బిజినెస్ దెబ్బతినడంతో డబ్బుకి కటకటలాడి బాంకును దోచి చూస్తే ఎలా వుంటుందా అనుకున్నాడు. తన రెనాల్ట్ కారులో సియాటెల్ వూరంతా చుట్టబెట్టాడు. వాషింగ్టన్ హెడాఫీస్‌గా గల పీపుల్స్ నేషనల్ బ్యాంక్ వారి బ్రాంచ్ అనువుగా కనబడింది. దాని చుట్టూ యిళ్లు, ఎపార్ట్‌మెంట్లు, చిన్నతరహా పరిశ్రమలు వున్నాయి. డ్రైవ్–ఇన్ బ్యాంకింగ్ సౌకర్యం వుంది. పగలు అతి బిజీగా వుండే ఆ ఏరియా రాత్రి అయ్యేసరికి నిర్మానుష్యంగా అయిపోతుంది. బ్యాంకు వెనక్కాల ఓ డ్రైవ్ వే (కార్లు వచ్చిపోయే మార్గం) వుంది. దాని ద్వారా కారులో బాంకు లోపలకి వచ్చేసి, కారు దిగనక్కరలేకుండా బాంక్ కౌంటరు వద్దకు చేరి, డబ్బు విత్‌డ్రా చేసుకునే సౌకర్యం వుంది. ఆ డ్రైవ్ వే చివర నీళ్లు రాకుండా అడ్డుగా కట్టిన ఓ మట్టిదిబ్బ వుంది. ఆ తర్వాత ఖాళీ స్థలం. అక్కడినుండి బాంకులో సేఫ్ అడుగుదాకా ఓ సొరంగం తవ్వుదామని అనుకున్నాడు జేమ్స్.

అతనికి పూర్వానుభవం ఏమీ లేదు. అయినా ఎవరినీ తోడుగా పెట్టుకోలేదు. తనొక్కడే మట్టిదిబ్బ దగ్గర మొదలుపెట్టి, కార్లు వెళ్లే డ్రైవ్ వే కిందగా సొరంగం తవ్వుకుంటూ వచ్చి బాంకు కిందదాకా వెళ్లిపోతే అక్కడ నుండి సేఫ్ పెట్టిన గదిలోకి చొచ్చుకుపోదామని ప్లాను వేశాడు. రాత్రిపూట అందరూ నిద్రపోయేవేళ తన రెనాల్ట్ కారులో అక్కడకి వచ్చి అక్కడున్న ఎపార్టుమెంట్ల దగ్గర పార్క్‌చేసి, పార, పలుగు తీసుకుని మట్టిదిబ్బకి కన్నం చేయడం మొదలుపెట్టాడు. తెలతెలవారుతూండగానే పని కట్టేసి కారెక్కి యింటికి వెళ్లిపోయి నిద్రపోయేవాడు. అర్ధరాత్రి మళ్లీ యీ పని. మట్టిదిబ్బలోంచి కన్నం తవ్వుకుంటూ ఎనిమిది అడుగులు వెళ్లేసరికి కప్పు కూలిపోయి సొరంగం మూసుకుపోయింది. జేమ్స్ తన ప్రయత్నం విడిచిపెట్టలేదు. మర్నాడే కలపదుకాణానికి కెళ్లి దుంగలు తెచ్చుకున్నాడు. మళ్లీ సొరంగం తవ్వి కప్పు కూలిపోకుండా దుంగలను దన్నుగా పెట్టి ముందుకు తవ్వుకుంటూ పోయాడు.

మట్టిదిబ్బ దాటి డ్రైవ్‌వే దగ్గరకు వచ్చేసరికి తవ్వగా వచ్చిన మట్టి ఏం చేయాలా అన్న ప్రశ్న ఎదురైంది. ఓ చెక్కముక్కమీద మట్టి ఎత్తిపెట్టి కింద దుంగలతో దొర్లించుకుంటూ బయటకు తెచ్చి మట్టిదిబ్బలోని మట్టిలో కలిపేసేవాడు. బయటకు వచ్చి సొరంగద్వారాన్ని దుబ్బులతో కప్పేసి అటూ యిటూ చెక్కలు, చెత్తా పడేసేవాడు. ఇలా వారాల తరబడి అతను పాతాళంలో పందికొక్కులా తవ్వుకుంటూ పోయాడు. తమ భవంతి కింద జరుగుతున్నదేదో తెలియని బాంకు స్టాఫ్ ఎప్పటిలాగా తమ పని చేసుకునేవారు. రాత్రుళ్లు ఆ వీధుల్లో పోలీసులు వ్యాన్లలో తమ నియమిత వేళలలో 'పారాహుషార్' అనుకుంటూ తిరుగుతూనే వుండేవారు. ఈ రెనాల్ట్ కారు యిక్కడెందుకుంది అని కూడా ఎవరికీ అనుమానం తగల్లేదంటే ఆ తనిఖీలు ఎంత మొక్కుబడిగా సాగాయో ఊహించవచ్చు.

ఇలా 18 అడుగులు తిన్నగా తవ్వుకుంటూ వెళ్లి బాంకు భవనానికి చేరుతూండగా కాస్త పైకి వంపు పెట్టి తవ్వుకుంటూ వెళ్లాడు. బాంకు ఫ్లోరింగ్ కిందకు చేరతాననుకున్నాడు కానీ క్రాల్ స్పేస్‌లోకి చేరాడు. బిల్డింగు కట్టినపుడు డ్రైనేజి పైపులు, ఎలక్ట్రిక్ వైరింగులలో సమస్యలు వస్తే పనివాళ్లు భవంతి అడుగున చేరి రిపేరు చేయడానికి గాను క్రాల్ స్పేస్ అని ఓ నాలుగు అడుగుల ఎత్తులో సొరంగంలా కడతారు. అక్కడ పనివాళ్లు గొంతుక కూర్చుని పనిచేయవచ్చు. (పక్కన చిత్రం చూడండి) అక్కడకి చేరాక బ్యాటరీలైటు వేసి చూస్తే ఓ నిచ్చెనా, అది ఎక్కితే డ్రైనేజీ మూత లాటి ఓ యినుప మూత కనబడ్డాయి. మూత ఎత్తి అటూ యిటూ చూస్తే అది బాంకు వాళ్ల ఫర్నేస్ రూమ్. దాని పక్కనే సేఫ్ వున్న గది వుంది. ఇంకా చూడాలనుకున్నాడు కానీ గబుక్కున ఏ అలారమైనా మోగిందంటే కొంప మునుగుతుందని తల దించేసుకుని, మూత మూసేశాడు. మూయడానికి ముందు స్ట్రాంగ్‌రూమ్ కింద వున్న కాంక్రీట్ శ్లాబ్ 18 అంగుళాల మందంగా వుందని గ్రహించాడు.

ఇక అప్పణ్నుంచి రోజూ సుత్తీ, ఉలీ పట్టుకుని ఆ శ్లాబ్‌ను పగలగొట్టసాగాడు. నెలలు గడిచిపోతున్నాయి కానీ కాంక్రీట్ చలించడం లేదు. మామూలు సుత్తి లాభం లేదని ఎలక్ట్రిక్ సుత్తి కొనాలనుకున్నాడు. దాంతో బాటు డ్రిల్లింగ్ మెషిను కూడా. అవి



అద్దె కిచ్చే సామాన్ల షాపుకి వెళ్లి ఏవి కావాలో చూసుకున్నాడు. ఆ రాత్రే షాపునుండి దొంగిలించాడు. ఎలక్ట్రిక్ సుత్తికి కరంటు కావాలి కదా. అటూ యిటూ చూస్తే బాంకు ఫర్నేస్ రూములో ఎలక్ట్రిక్ పాయింటు కనబడింది. ఆ పాటికే జేమ్స్‌కు బాంకు మనదేనన్న ఫీలింగు వచ్చేసింది. నిర్మొగమాటంగా దానిలోనే ప్లగ్ పెట్టేశాడు. ఇక అప్పట్నుంచి తన దోపిడీకి కావలసిన కరంటును బ్యాంకే సప్లయి చేసుకుంది. సుత్తికి కరంటు పెట్టి స్విచ్ ఆన్ చేయగానే చచ్చేటంత శబ్దం చేసింది. జేమ్స్‌కి భయం వేసి దాన్ని కిందపడేసి పారిపోయాడు. సినిమాలలో లాగ సైరన్లు వూదుకుంటూ పోలీసు కార్లు వచ్చి చుట్టుముడతాయనుకున్నాడు. అలాటిది ఏమీ జరగలేదు. కానీ అతనికి ధైర్యం చెదిరింది. సొరంగం పని మానేసి చుట్టాల్ని పలకరించడానికి పొరుగూళ్లు వెళ్లిపోయాడు.

కొన్నాళ్లకు ధైర్యం చిక్కబట్టుకుని తిరిగి వచ్చాడు. ఇలా అనేక రాత్రులు భయంకర శబ్దంతో సుత్తి వుపయోగించేబదులు ఒకేసారి డైనమైట్ పెట్టి ఫ్లోరింగ్ పేల్చేసి కన్నం ఏర్పరచుకుంటే మంచిదనుకున్నాడు. క్వారీ తవ్వించాలి, డైనమైట్ ఎక్కడ దొరుకుతుంది అంటూ మార్కెట్లో విచారిస్తే, 60 మైళ్ల దూరంలో ఓ వూళ్లో నైట్రోగ్లిసరిన్ దొరుకుతుందన్నారు. వెళ్లి పాతిక డాలర్లు పెట్టి కొనుక్కుని వచ్చాడు. తర్వాత లైబ్రరీకి వెళ్లి బ్లాస్టింగ్ ఎలా చేయాలో కిటుకులు నేర్పే పుస్తకాలు చదివాడు. ఫిబ్రవరి రెండో వారం వచ్చేసరికి కాంక్రీట్ ఫౌండేషన్‌లో కన్నాలు డ్రిల్ చేయడం జరిగిపోయింది. దీనివలన దుమ్ము లేస్తే జేమ్స్ బాంకు గదిలో పడేసి వున్న నీళ్లగొట్టంతో దుమ్ముపై నీళ్లు చల్లేవాడు. రంధ్రాలు తయారయ్యాక వాటిలో డైనమైట్ కూరి పేల్చాడు. ఊడింది ఐదు అంగుళాల మందమే కానీ బిల్డింగ్ మాత్రం వూగిపోయింది. జేమ్స్‌కు మళ్లీ భయం వేసి పారిపోయాడు. మర్నాడు బ్యాంకులో కలకలం చెలరేగి సొరంగం బయటపడిపోతుందని అనుకున్నాడు.

మర్నాడు బాంకులో కలకలం రేగినమాట వాస్తవం. గోడల్లో, సీలింగ్‌లో పగుళ్లు వచ్చాయని, ఎక్కణ్నుంచో దుమ్ము వస్తోందని స్టాఫంతా ఫిర్యాదు చేశారు. ఏమైందో చూడమని కొందర్ని పురమాయించారు. వాళ్లు బిల్డింగ్ కిందకు తొంగిచూసేబదులు, పైకి వెళ్లారు. మూడో అంతస్తులో కాగితాలు ముక్కలు ముక్కలు చేసే భారీ యంత్రం ఒకటి వుంది. పగలంతా అది పనిచేసేటప్పుడు దడదడ శబ్దం బాంకులో వినబడుతూనే వుంటుంది. ఆ పేపర్ కట్టర్ వల్లనే కాకుండా పక్కనే వున్న విమానాశ్రయం నుండి జెట్ విమానాలు నిరంతరం వెళుతూండడం వలన ప్రకంపనాలు కలిగి యీ పగుళ్లు, యీ దుమ్ము వస్తున్నాయి అనుకున్నారు. అనుకుని వూరుకున్నారు. 1961 ఫిబ్రవరి 17 న శుక్రవారం నాడు బాంకు లక్షా ఏభైవేల డాలర్లు క్యాష్ వున్న వాల్ట్‌ను భద్రంగా మూసేసి వెళ్లారు. అవేళ రాత్రి 11 గంటలకు జేమ్స్ సొరంగంలోకి దూరి ఆ గది కింద మరిన్ని రంధ్రాలు చేసి డైనమైట్ పెట్టి అర్ధరాత్రి ఒంటిగంటన్నరకు పేల్చాడు.

బాంకు దద్దరిల్లింది కానీ అలారం మోగలేదు. చుట్టుపట్ల నివాసం వున్నవారు నిద్రలో కాస్త కదిలారు. ఆ టైములో టీవీలో సినిమా చూస్తున్న యిద్దరు ఆడవాళ్లు “ఈ జెట్ విమానాలు కాదు గానీ, అవి చేసే శబ్దాలకు చెవులు పగిలిపోతున్నాయి, డైలాగులు వినబడటం లేదు” అని విసుక్కున్నారు. శనివారం మధ్యాహ్నం జేమ్స్ బాంకు వైపుకి వచ్చాడు – బిల్డింగ్ ఓ పక్కకు ఒరిగిపోయిందేమో చూడడానికి ! అలా ఏమీ జరగలేదు. అవేళ సెలవైనా ఓ క్లర్కు పెండింగు ఫైళ్ల పని చూసుకోవడానికి వచ్చి పని చేసుకుంటున్నాడు. బిల్డింగ్ మేన్‌టేన్ చేసే అతను వచ్చి అతనితో పోట్లాట వేసుకుంటున్నాడు – “స్టోరు రూములో ఆ దుమ్మేమిటి? చీపుళ్లు అటూ యిటూ పడేసి వున్నాయేమిటి? నాకు తెలియకుండా రిపేరు పనివాళ్లెవరో వచ్చి అంతా తగలేసినట్టున్నారు..” అంటూ. నాకేం తెలియదు అన్నాడు యీ గుమాస్తా. అతను కాస్సేపు తిట్టుకుని గదంతా శుభ్రం చేసి వెళ్లిపోయాడు. సాయంత్రం అవుతూండగా గుమాస్తా కూడా పని పూర్తి చేసుకుని వెళ్లిపోయాడు.

శనివారం అర్ధరాత్రి దాటాక జేమ్స్ సొరంగంలోని దుమ్మూ, ధూళీలోంచి పాక్కుంటూ వెళ్లి వాల్ట్ కిందకు చేరాడు. అక్కడ పెద్దకన్నం చూడగానే అతని గుండె ఆనందంతో మొగ్గలు వేసింది. నాలుగు నెలల శ్రమను అదృష్టం వరించింది. ఆ కన్నం సరిగ్గా ఆ గదిలో మధ్యలో పడటంతో అలారం పరిధిలోకి రాలేదు. అందుచేత అవి మోగలేదు. ఆ కన్నంలో నుండి పైకి ఎగబాకి స్ట్రాంగ్ రూమ్ మధ్యలో నిలబడి అటూ యిటూ చూస్తే ఎటు చూసినా డ్రాయర్లున్నాయి. స్క్రూ డ్రైవర్ పెట్టి తెరిస్తే వాటినిండా కట్టలు కట్టలుగా కరెన్సీ నోట్లు. వెంట తెచ్చుకున్న సంచుల్లో ఆ కట్టలు వేసుకుని సొరంగంలోంచి యీడ్చుకుంటూ బయటకు తెచ్చి తన కారునిండా పడేసి, యింటికి వచ్చి ఆ డబ్బు అక్కడ పడేసి, మళ్లీ వెళ్లి మళ్లీ సంచులు నింపుకుని వచ్చాడు. తెల్లవారేసరికి 45 వేల డాలర్లు యీ విధంగా రవాణా చేశాడు. డబ్బంతా భద్రంగా దాచుకుని ఆదివారం రాత్రి మళ్లీ సొరంగంలోకి వచ్చాడు. తనకు సంబంధించిన వస్తువులు ఏమైనా వున్నాయేమో వెతికి వెతికి అక్కణ్నుంచి తొలగించాడు.

సోమవారం ఉదయం బ్యాంకు తెరవగానే వాళ్లకు తెలిసిపోయింది, డబ్బు పోయిందని. వాల్ట్ మధ్యలో వున్న కన్నం ద్వారా లోపలకి దిగి సొరంగం సంగతి తెలుసుకున్నారు. ఇంత పెద్ద సొరంగం యింత కష్టపడి తవ్వారంటే ఏదో ప్రొఫెషనల్ ముఠాయే యిది చేసి వుండాలని అనుకున్నారు. ఇంతకుముందు యిలా చేసినవాళ్లందరినీ ఓ చూపు చూశారు. ఎవరూ తమ పని కాదన్నారు. ఎఫ్‌బిఐ ఎలక్ట్రానిక్ డిటెక్టర్లతో రంగంలోకి దిగింది. రాష్ట్ర పోలీసులు ఆ ప్రాంతమంతా జల్లెడ పట్టేశారు. జేమ్స్‌కి పాత రికార్డు లేకపోవడంతో ఎవరికీ అతనిపై అనుమానం రాలేదు. అతనితోబాటు వేరెవరైనా ఇన్వాల్వ్ అయి వుంటే వాళ్ల ద్వారానైనా బయటకు వచ్చేదేమో. అతను ఒక్కడే మొత్తం పనంతా నిర్వహించడంతో ఆచూకీ తెలియకుండా పోయింది.

మరి యీ నేరం బయటకు ఎలా వచ్చిందన్న అనుమానం వస్తోందా? ఇక్కడే క్రిమినల్స్ లక్షణాలు తెలుస్తాయి. నేరాన్ని ఎంతో తెలివిగా నిర్వహించిన నేరస్తుడు ఆ తర్వాత అహంభావి అవుతాడు. తనను ఎవరూ పట్టుకోలేరనే గర్వంతో తప్పులు చేస్తాడు. ఎటువంటి ఆధారాలు లేకుండా మొదటి హత్య చేసిన నేరస్తుడు తర్వాత అవసరం వున్నా లేకపోయినా యింకో హత్య చేయడానికి వెనుకాడడు. అది అతనికి ఒక ఆట అయిపోతుంది. తనను ఎవరూ పట్టుకోలేకపోయారన్న ఆనందంలో రెండో హత్య చేసినపుడు

ఏదో ఒక ఆధారాన్ని పొరపాటున విడిచిపెడతాడు. అదీ, రెండూ హత్యల్లో వున్న పోలికలూ అతన్ని పోలీసులకు పట్టిస్తాయి. డబ్బు విషయంలోనైతే యిలా అడ్డదారిలో సంపాదించినది ఖర్చు పెట్టేవరకూ చేతులు దురద పెడతాయి. ఇది తెలిసిన పోలీసులు నేరం జరిగాక ఎవరు బాగా ఖర్చు పెడతారా అని గమనిస్తూ వుంటారు.

జేమ్స్‌కు యీ సంగతి తెలుసో లేదో కానీ అతను నిర్లక్ష్యం వహించాడు. ఈ బ్యాంకు కాక వేరే బ్యాంకులో ఖాతా తెరిచి దానిలో యీ డబ్బులో చాలాభాగం వేశాడు. ఇంటి అప్పు కొంత తీర్చాడు. వెయ్యి డాలర్లు పెట్టి స్టేషన్ వ్యాగన్ బుక్ చేశాడు. ఆ వ్యాగన్‌వాడు బాంకులో ఆ నోట్లు జమ చేయడానికి వెళ్లినపుడు దొంగిలించిన నోట్ల నెంబర్లు, యివీ ఒకటే కావడంతో అతన్ని బాంకువాళ్లు నిలదీశారు. అతను ఫలానా జేమ్స్ యిచ్చాడని చెప్పాడు. జేమ్స్ ఖాతాలో చూడబోతే కొత్తగా బోల్డు డబ్బు వచ్చినట్టు తేలింది. అంతే మర్నాడు ఉదయానికల్లా జేమ్స్‌ను చుట్టుముట్టారు. అతను సులభంగానే లొంగిపోయి తన కథంతా చెప్పేశాడు. 20 ఏళ్లు జైలు శిక్ష పడింది.

ఇంత తెలివిగా నేరం చేసినవాడు, యింత తెలివితక్కువగా పట్టుబడిపోవడం, దీనిలో పెద్ద నేరపరిశోధన లేకపోవడం మనను నిరుత్సాహపరచవచ్చు. కానీ యధార్థ సంఘటనలు యిలాగే వుంటాయి. అందుకే 90% మంది నేరస్తులు దొరికిపోతూ వుంటారు. లేకపోతే వాళ్లను పట్టతరమా? **– ఎమ్బీయస్ ప్రసాద్ (డిసెంబరు 2011)**